క్లుప్తంగా

వైభవంగా పల్లకిసేవ



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గంధళ్ల కృష్ణయ్య- అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులకు అత్యాధునిక చికిత్స

నెల్లూరు రూరల్: హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులకు నగరంలోని మెడికవర్ హాస్పిటల్లో అత్యాధునిక వ్యవస్థ అందుబాటులో ఉందని హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ సీతాలక్ష్మి, గైనకాలజిస్ట్ మంజూష తెలిపారు. ఈ మేరకు ఆస్పత్రిలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

గడ్డివామి దగ్ధం

- రూ.80 వేలకుపైగా నష్టం



చేజర్ల(ఆత్మకూరు): గడ్డివామి దగ్ధమైన ఘటన చేజర్ల మండలంలోని యనమదల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు ఆదిరెడ్డి శేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. ఇటీవల వరికోతల అనంతరం పశువుల కోసం పది ఎకరాలకుపైగా గడ్డిని నిల్వ చేశారు. ఈ క్రమంలో శనివారం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.80 వేలకుపైగా నష్టం సంభవించిందని బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ముగిసిన ఉద్యోగుల నిరసన

ఉదయగిరి: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూఏ ఉద్యోగుల నిరసన కార్యక్రమాలు ఐదో రోజు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు ఐదు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో డిపో ఎన్ఎంయూఏ నాయకులు వెంకటేశ్వర్లు, శంకర్, నాగరాజు, రమణయ్య, జ్యోతి, నాగమణి, సుజాత, కోటేశ్వరరావు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూరు: ఇటీవల ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని రెండో వార్డు వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన పుల్లారెడ్డి, అజీమాలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయా కుటుంబీకులను శనివారం పరమేశ్వరరెడ్డి పరామర్శించి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. వార్డు కౌన్సిలర్ శివకోటారెడ్డి, ట్రస్ట్ సభ్యుడు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

పొదలకూరు : త్యాగానికి ప్రతీకే బక్రీద్ పండగ అని జామ్యా మసీదుకు చెందిన మౌలానా ఖాజీ ముస్తాక్ మదనీ సందేశమిచ్చారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా పట్టణానికి సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు మాట్లాడుతూ దైవ ఆదేశానుసారం బలిదానం చేసి త్యాగనిరతిని చాటుకున్నట్టు పేర్కొన్నారు. ఏ మత గ్రంథాలైనా పేదలను ఆదరించాల్సిందిగా సూచిస్తున్నట్టు తెలిపారు. దైవానుగ్రహానికి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రతి ముస్లిం పేదలకు సాయం చేయాలన్నారు. సొంత మతాన్ని ఆదరించడంతో పాటు ఇతర మతాలను గౌరవించాలన్నారు. అనంతరం చదువులో ప్రతిభ చూపిన ముస్లిం విద్యార్థులను సన్మానించారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఖాజానగర్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెంకటాచలం: కసుమూరు దర్గాలో పడమటి వాకిలి వద్ద భక్తుల రద్దీ

⇨ **వెంకటాచలం:** బక్రీద్ పండగను మండల పరిధిలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వెంకటాచలం, సర్వేపల్లి, ఇస్లాంపేట తదితర గ్రామాల్లోని మసీదులు, ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ క్రమంలో దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో పడమటి వాకిలి తెరిచారు. ప్రతి బక్రీద్ పండగ నాడు ఈ వాలికి తెరిచి భక్తులను దర్గాలోకి అనుమతిస్తారు. దీని గుండా దర్గా లోపలికి వెళ్లి మస్తాన్‌స్వామి సమాధిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.

⇨ **కొడవలూరు:** బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు శనివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నార్తురాజుపాళెంలోని మహమ్మదీయ మజీద్‌లో బక్రీద్ సందర్భంగా మత గురువు ఇమాం ముజం మిల్ మాట్లాడుతూ త్యాగానికి గుర్తుగా జరుపుకునే పండగే బక్రీద్ అన్నారు. ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని అల్లాహ్ గుర్తించిన రోజే బక్రీద్ అని, ఉన్నంతలో తోటి వారికి సాయం చేయాలని, శాంతి, సహనం, కరుణతో పాటు ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నదే అల్లాహ్ సందేశమని చెప్పారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఇమామ్‌లు మజీద్ ముత్తువల్లి ఇలియాజ్, మజీద్ మోసం సాబీర్, మజీద్ కమిటీ సభ్యులు అబ్దుల్ కరీం, ఫరూక్, ఫాసిల్, రసూల్ సాహెబ్‌లు పాల్గొన్నారు.

⇨ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** త్యాగానికి ప్రతీక బక్రీద్ పండగ అని ముస్లిం మతపెద్దలు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణం, రూరల్ ప్రాంతాల్లో బక్రీద్ సందర్భంగా ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాశీపాళెంలోని మస్జిద్ ఏ హబీబ్, ఖాజానగర్‌లోని మసీదుల వద్ద ముస్లిం మతపెద్దలు ఈమామ్ అహ్మద్ రజా, అఫ్రాన్ రజాక్‌లు బక్రీద్ సందేశం వినిపించారు. అనంతరం నమాజ్ ఆచరించి విశేష ప్రార్థనలు నిర్వహించారు. రూరల్ ప్రాంతాల్లోని పలు మసీదుల వద్ద ముస్లింల ప్రార్థనలతో సందడి నెలకొంది.



పొదలకూరు : విద్యార్థులకు సన్మానం

⇨ **మనుబోలు:** మండల కేంద్రంలోని మనుబోలులో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే ముస్లింలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న ఈద్గా, బీసీ కాలనీలోని మసీదు వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మత గురువు కౌసర్ అల్లాహ్ బోధనలు, ప్రవచనాలను చదివి వినిపించారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ ప్రార్థనల్లో మైనారిటీ నాయకులు అన్సర్, జకీర్, అహ్మద్‌బాషా, జలీల్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : ఈద్గా వద్ద దైవ సందేశమిస్తున్న మత పెద్ద



కొడవలూరు: దైవ సందేశమిస్తున్న మత పెద్ద



కొడవలూరు: ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



మనుబోలులో..

ప్రతిభా అవార్డులకు ఎంపిక

మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు మండలం నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఈఓ వసంతకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ విభాగం నుంచి 571 మార్కులు సాధించిన మనుబోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని తాంబరపు లక్ష్మీసాహితి, 553 మార్కులు సాధించిన నాగవైష్ణవి, ఎస్టీ విభాగం నుంచి 570 మార్కులు సాధించిన కంటేపల్లి మౌనిక, బీసీ-ఏ విభాగంలో 548 మార్కులు సాధించిన చల్లా లిఖిత్‌కృష్ణ, బీసీ-ఈ విభాగంలో 558 మార్కులు సాధించిన మడమనూరు హైస్కూల్ విద్యార్థిని షేక్ నేహా తదితరులను ఎంపిక చేసినట్లు వివరించారు. వీరికి రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు.

చాముండేశ్వరికి అశ్వవాహన సేవ



అశ్వవాహనంపై అమ్మవారు

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు అశ్వవాహనంపై భక్తులను కటాక్షించారు. పుష్పాలంకరణతో శోభాయమానంగా వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారిని భక్తులు దర్శించి తన్మయం చెందారు. ఉభయకర్తలుగా స్థానిక వైశ్య సంఘీయులు వ్యవహరించారు. ఉదయం చప్పర ఉత్సవం జరిగింది. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉత్సవం సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

జీవన ఎరువులతో మేలు



తోటపల్లిగూడూరు : మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

తోటపల్లిగూడూరు: జీవన ఎరువులతో భూమికి ఎంతో మేలు అని, రైతులు వీటి వాడకాన్ని పెంపొందించుకోవాలని కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని కోడూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి దుక్కులు వాటి ఆవశ్యకత గురించి వివరించారు. విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాల్సిందిగా సూచించారు. ఏడీఏ మారుతీదేవి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించాలన్నారు. సమావేశంలో ఏఓ శిరీషారాణి, బ్యాంకింగ్ కో-ఆర్డినేటర్ రవిశంకర్, వీఏఏలు వినీల్‌శివకుమార్, విద్యాసాగర్, నిరీష, దయానా, అనూషా, ఝాన్సీ, వైష్ణవి, ఏఈఓ ప్రసన్న పాల్గొన్నారు.



ముత్తుకూరులో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ముత్తుకూరు(పొదలకూరు) : రసాయన ఎరువుల వాడకాన్ని బాగా తగ్గించాలని, లేకుంటే భూమి సారవంతాన్ని కోల్పోతుందని ఐఐఆర్ఆర్ కేంద్ర విభాగం శాస్త్రవేత్త నాగేశ్వరరావు అన్నారు. ముత్తుకూరు మండలంలోని పంటపాళెం రైతు సేవా కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా భూమి సారవంతాన్ని తెలుసుకోవాలని సూచించారు. కేవీకే నెల్లూరు మత్స్య శాస్త్రవేత్త మరిసాధు సమగ్ర చేపల పెంపకం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ జ్యోత్స్న, వీఏఏ రమ, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆభరణాల మాయంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : సూట్‌కేస్‌లోని నగలబాక్సులో ఉంచిన డైమండ్, బంగారు ఆభరణాలు అపహరణకు గురైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. కర్నూలుకు చెందిన కృష్ణమూర్తి, వీరనారాయణమ్మ దంపతులు తమ బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు గానూ పొదలకూరుకు గత నెల 15న వచ్చారు. అనంతరం తల్లి వద్దకెళ్లారు. తన 150 గ్రాముల డైమండ్, బంగారు ఆభరణాలను బాక్సులో ఉంచి సూట్‌కేస్‌లో అదే నెల 19న ఆమె పెట్టుకున్నారు. కర్నూలు వెళ్లేందుకు గానూ పొదలకూరు నుంచి ఆర్టీసీ బస్సులో నెల్లూరు చేరుకున్నారు. అనంతరం కర్నూలు బస్సెక్కి, సూట్‌కేసును అందులో ఉంచి వాష్‌రూమ్‌కు వెళ్లారు. మరుసటి రోజు కర్నూలులో బస్సు దిగి ఇంటికెళ్లి, కొద్దిసేపటి అనంతరం సూట్‌కేస్‌లోని బాక్సును తెరవగా, అందులో ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు విషయాన్ని అదే రోజు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో హాస్పిటల్లో చికిత్స పొంది నెల్లూరుకు శనివారం వచ్చారు. తాను వాష్‌రూమ్‌కు వెళ్లొచ్చేసరికి, తన సీటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి ఉన్నారని, చోరీకి ఆయనే పాల్పడి ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాంకేతికత ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై ఇద్దరి దాడి

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు నిందితులపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్ట మున్సిపల్ వీధిలో నివాసం ఉంటున్న వెంకటేష్‌కు అదే ప్రాంతానికి చెందిన నానీ అలియాస్ చందుతో పాత గొడవలున్నాయి. ఈ క్రమంలో టీ తాగేందుకు వెంకటేష్ శుక్రవారం వెళ్తుండగా, నానీ అతని స్నేహితుడు శివ అడ్డుకొని దాడి చేశారు. గాయపడిన బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

పొదలకూరు : ఏపీ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు స్టేట్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ ఎంపీసీ విద్యార్థిని దేవళ్ల నిత్యకృతిక 470 మార్కులకు 467 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలువగా, ఎస్‌కే తస్లీమా 466 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఇదే గ్రూపులో సాయికీర్తి, హేమంత్, లిఖిత 464 మార్కులు కైవసం చేసుకున్నారు. త్రివేణి 462, సాయిరోహిత్, మేఘన 460 మార్కులు సాధించారు. సీఈసీలో నందిని 469 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శనివారం అభినందించారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్ ఎ.సుబ్బారావు, జి.నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ కృష్ణ, చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పలువురికి ప్రసన్న పరామర్శ



కోవూరు: మీరారెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్న



ఇందుకూరుపేట: గంగపట్నంలో..

కోవూరు: మండలంలోని ఇనమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యరటపల్లి మీరారెడ్డిని ఆయన నివాసంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, అనూప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, నరసింహులురెడ్డి, సుధీర్‌రెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీలత, విష్ణు, జగన్, ప్రమీలమ్మ, నందగోపాల్ తదితులు ఉన్నారు.

⇨ **ఇందుకూరుపేట:** మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పంబాల జనార్దన్‌రెడ్డిని మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. జనార్దన్‌రెడ్డి తండ్రి సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఆయన చిత్రపటానికి ప్రసన్న నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నాయకులు దండిగుంట ఫణీంద్రనాయుడు, వేణుంబాక మహీధర్‌రెడ్డి, గుడి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న న్యాయవాది శ్యామాచార్యులు

కోవూరు: పాటూరు రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో ప్రతి శనివారం లీగల్ సెల్‌కు సంబంధించిన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు న్యాయపరమైన సలహాలు సూచనలు కావాలంటే సద్వినియోగం చేసుకోవాలని పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, లీగల్ సెల్ నాయకుడు శ్యామాచార్యులు తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో కేవలం వైఎస్సార్‌సీపీ నాయకుల మీద కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి వంటి అనేక పథకాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ప్రజలకు కూటమి ప్రభుత్వం మీద ఉన్న ఆశలు ఆడియాశలు అయ్యాయన్నారు. రానున్న రోజుల్లో మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం లీగల్ సెల్ నేతలు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం ఇష్టానుసారం చార్జీలు పెంచడం వల్ల పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెప్పే రోజులు వస్తాయన్నారు. వైస్ ఎంపీపీ, పార్టీ పట్టణ కన్వీనర్ నరసింహులురెడ్డి, లీగల్ సెల్ న్యాయవాదులు బాలకృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వేగంగా నావూరు బ్రిడ్జి నిర్మాణం

పొదలకూరు : గత ప్రభుత్వంలో మంజూరైన మండలంలోని నావూరు పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. గతేడాది ఎన్నికల ప్రక్రియలో భాగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 20 శాతం పూర్తయిన పనులను తిరిగి చేపట్టాల్సిందిగా ఉత్తర్వులు ఇవ్వడంతో అధికారులు పనులను తిరిగి ప్రారంభించారు. చాలా ఏళ్లుగా నావూరు పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం చుట్టుపక్కల గ్రామాల ప్రజల కలగా ఉండేది. దీంతో గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.3.62 కోట్ల నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించారు. సంగం మెయిన్ రోడ్డు నుంచి నావూరు మీదుగా చేజర్ల మండలం రెడ్డివారికండ్రిగ వరకు సుమారు 20 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణ పనుల కోసం కూడా రూ.10.83 కోట్ల నిధులను అప్పట్లో మంజూరు చేశారు. అయితే ఎన్నికల నియమావళి తదితర కారణాల వల్ల పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు రోడ్డు పనులను ఇటీవల పూర్తి చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు మరో కాంట్రాక్టర్ చేపట్టాల్సి ఉండడంతో ఇప్పుడు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ బ్రిడ్జి పూర్తయితే వర్షాకాలం చెన్నారెడ్డిపల్లి, నావూరు, నావూరుపల్లి, భోగసముద్రం తదితర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి.



నావూరు పెద్దవాగుపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

తాగునీరు అందించాలని మహిళల ఆందోళన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామ పంచాయతీ గిరిజన కాలనీల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు గత నాలుగు రోజుల నుంచి తాగునీరు రావడం లేదని పలువురు మహిళలు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా తమ సమస్యను పంచాయతీ సిబ్బంది, స్థానిక సర్పంచ్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పక్కనే పెన్నానది ఉన్నా తాగునీరు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



మాట్లాడుతున్న గిరిజన మహిళలు